అజ్ఞాతవాసి అంతరంగం

# క్షేమ సమాచారం

‘భవదీయుడు’

నీ లేఖ చేరింది. క్షేమంగా వున్నావా అని వ్రాశావు. క్షేమంగానే వున్నానని వ్రాసే ముందు క్షేమమన్న దానికి అర్థ మేమిటనే సందేహం కలిగిం దెందుకనో.

పైకి చూస్తే ఆరోగ్యంగా వున్నట్టే కనబడుతుండవచ్చుగాని, మానసికంగా ఎంత వ్యథపడుతున్నానో యీ లేఖ చూశాక నా సందేహాన్ని అంత అర్థంలేని దానిగా త్రోసివెయ్య వనుకుంటాను.

నేటి జీవితం ఎంత భారంగా, అనుమానంగా గడుస్తున్నదో బహుశా మాటలతో వ్యక్తీకరించలేనేమో. ఇంత విషపూరిత వాతావరణానికి కారణం నీకు తెలియక పోదనుకుంటా - మన సోదరుల సాయుధ పోరాట మనే దాని ఫలితం.

దీంతో నిర్భయంగా ప్రయాణం చేయడం, శాంతంగా బ్రదకడం - రెండూ పూర్తిగా కరువయాయంటే నమ్ముతా వనుకుంటా.

అన్నింటికంటే ముందు-దేశానికి పై రెండు కొరతలూ తీరడం ముఖ్యావసర మనుకుంటున్నాను. ఇవి మానసికమైనవే కావచ్చు. మానసిక అవసరాలకంటె భౌతిక అవసరాలైన తిండి, బట్ట, యిల్లు ఎక్కువ ప్రాముఖ్యంగలవని నీవు గోలపెడతావుగాని నేను యీ భీకర పరిస్థితుల్లో పూర్తిగా నీతో ఏకీభవించలేక క్షమించమంటున్నానంటే కొంతవరకు నీవు ఆమోదిస్తావనే ఆశిస్తాను.

ఎన్నాళ్ళయింది-శాంతంగా కూర్చుని ఏ చీకూ చింతాలేకుండా మన వాళ్ళందరితో ముచ్చట్లాడుతూ కులాసాగా భోంచేసి; రాత్రిలందు చెల్లాయిలూ, తమ్ముళ్లతో కథలు చెప్పుకుంటూ నవ్వుతూ, ఆనందిస్తూ మైమరచి నిద్రపోయి! బహుశా రెండేళ్ళయిం దనుకుంటాను- వాటిని మరిచిపోయి. ఈ రెండేళ్లనుండీ రాత్రులందు యిల్లువదిలి, ఎక్కడో ఎవరి కంటాబడని ఏ గుడిసెలోనో, గోతుల్లోనో డుక్కుడుక్కుమంటూ అరచేత ప్రాణాలుంచుకొని కాలం గడపడం, పగలు ఎప్పుడో అటూయిటూ బిత్తర బిత్తరగా చూసుకుంటూ నాలుగు మెతుకులు ఎంగిలి చేయడం...ఇదీ పరిస్థితి. ఇదంతా ఆరోగ్యమేనా ? సుఖమేనా ?

ఎంత జాగ్రత్తగా ఆలోచించినా నాకీ వింతవిప్లవం అర్థం కావటం లేదు.

అయితే- అది వాళ్ళ సిద్ధాంత మంటావు నీవు. అవును, గోపీచంద్ కూడా అదే అన్నాడు.

“మానవుడు మొదట్లో తన రక్త సంబంధీకులతో సహకరిస్తూ మిగిలిన వారితో పోరాడాడు. తరువాత తన దేశస్థులతో కలిసి మిగిలినవారితో పోరాడాడు. ప్రస్తుతం - తను నమ్మిన సిద్ధాంతాలకు అనుకూలురతో సహకరిస్తూ వ్యతిరేకులతో పోరాడుతున్నా”డని స్పష్టీకరించాడు.

కాని, పోరాటమంటే యేమిటి? ఒకరి నొకరు చంపుకోవడమేనా ? ఏ మవసరం ? ప్రయోజన మేమిటి ? అనే సమస్యలు పరిష్కరింప బడక నన్ను అల్లకల్లోల పరుస్తున్నాయి.

ఎక్కడో ‘చలం’ యిలా అన్నట్టు గుర్తు— “ప్రతి పనికీ అవసరమూ, ప్రయోజనమూ వుండా”లని.

కాని, నాకీ పోరాటానికి ఆ రెండూ కనబడడం లేదు. బహుశా వాటి లోతుపాతులు బాగా అర్థంచేసుకొనే సమర్థత నావద్ద లేదేమో !

వాళ్ళు పైకి అనవచ్చు—

“దేశంలో పీడించే వాళ్లున్నన్నాళ్లు దేశం బాగుపడదు. అందుకని అందర్నీ హతమార్చాల్సిందే”నని.

అయితే - వాళ్లలాగ వూహించలేని, పరిస్థితుల వర్థం చేసుకోలేని అభివృద్ధి నిరోధకులు యింకా మన విజ్ఞానుల్లో అంత ఎక్కువగా వున్నారంటావా ?

ఈనాడు ప్రతివారూ- యీ కుళ్లు వ్యవస్థ పోవాలనీ, నూతన వ్యవస్థ రావాలనీ కలలు

గంటున్న సంగతి మనకు తెలియంది కాదు. అయితే నూతనవ్యవస్థా నిర్మాణంలో వీరి ఆచరణ అంత సంతృప్తికరంగా లేదనో లేక ఆ వచ్చే నూతనవ్యవస్థ ఏదో అది కాస్తా వారి చేతి మీదుగానే రావాలనో యీ పోరాటం సాగిస్తున్నారేమో తోచదు.

పోనీ-బాగుచేయడం విషయంలో ఒకరి కొకరు యిలా పోటీలు పడడం అవసరమేమోనని ఒప్పుకొన్నా, మళ్లీ ప్రయోజనం అన్న సందేహ మలాగే నిలిచిపోయింది.

ఈ హత్యాకాండ, లూటీలు, దుర్నీతికూడా లాభాల్లోనే అంచనా వేసుకోవడం నాకు చేతగాని పనిగా వుంది.

ఇవేళ-వాళ్లి పోరాటాన్ని సుఖపడుతూ చేస్తున్నారని నేను ఆరోపించను. ఇక్కడ మేమెంతగా వాళ్లనిగురించి భయపడుతూ, గజగజలాడుతూ అనుమానాలతో జీవిస్తున్నామో-వాళ్లూ పోలీసు లొస్తారనీ, తమ ప్రజలే పట్టిస్తారనీ, తమ అనుచరులే ఎదురు తిరుగుతారనీ కూడా ప్రతి సెకండూ బిక్కు-బిక్కు మంటూ జీవిస్తున్నారని తెలుసు.

ఇది-రేపు ఉదయించబోయే నూతన వ్యవస్థకు ప్రసవవేదనని సమర్థిస్తారేమో! ఇంత భయంకరమైన, అసహ్యకరమైన, అనాగరికమైన నూతనవవ్యస్థ అక్కర్లే దాటాను. కాని, నా మొర లాలించేవారు లేకపోవచ్చు. అయినా-ఘోష విన్నవించుకోక తప్పదు.

మనిషి, యింతవరకూ చచ్చిపోయినవాడిని బ్రదికించగలగడం సాధ్యపడకపోయినా, హాయిగా బ్రతుకుతున్నవాడిని తేలికగా చంపేసి ఏదో గొప్పతనం చేశానని కులికే నాగరికత నా మనస్తత్వాని కేమాత్రం సరిపడడంలేదు.

అయినా-యీ విషయాలన్నీ గట్టిగా అనుకోడానికికూడా లేదు. ఇప్పటికే నేను-బూర్జువా నుండి ఇంటలెక్చుయల్ బూర్జువానై, రియాక్షనరీలోకి మారి, ప్రస్తుత మాదశ దాటిపోయి-'ప్రజా ద్రోహి'గా పరిణామం చెందినట్టు వాళ్ల లిస్టు వేసుకుంటున్నారని తెలుస్తున్నది.

నే నెలా ప్రజా ద్రోహి నవుతానని నీవు ముక్కుపై వేలువేసుకోవచ్చు.

నీ విదివరకు వుపయోగించుకున్న 'డిక్షనరీ'లో ప్రజాద్రోహమంటే- పీడించే వాడనీ, జమీందారనీ, దేశముఖనీ...యింకా ఏవేవో అర్థాలు దొరికి వుండవచ్చు. ఇప్పుడా అర్థం మారింది. (పూర్వపు అర్థంమాత్రం మంచిదా అనేది వేరే ప్రశ్న.) కనుక ఆ డిక్షనరీని చించివేసి, పూర్తిగా తగలబెట్టెయ్యి. ఇప్పటి ప్రజాద్రోహి ఎవరో స్పష్టంగా చెప్పేందుకు యింకా యే డిక్షనరీ పూనుకోనట్టుంది. ప్రస్తుతం పరిశోధనలు సాగుతున్నాయి. అయితే, బహుశా యిప్పుడు యీ అర్థం తప్పకుండా రాయాల్సొస్తుందనిమాత్రం గ్యారంటీ యిస్తున్నాను:

"చంపబడేవాడు దుర్మార్గుడని నైతిక ప్రపంచం కూడా ఆమోదించి చలామణయేందుకు-చంపబడలుచుకున్నవాడు- తన సిద్ధాంతాల వ్యతిరేకునికి తగిలించ వలసిన గౌరవప్రదమైన ఉరి".

ఇలా అంటే నీవు మరీ ఆశ్చర్యపడతావేమోగాని- వాస్తవ మిదే నన్నాక గుర్తింపక తప్పదు. అయినా-నీ ఆశ్చర్యాలకూ, ఆశయాలకూ వారి సిద్ధాంతాలు సంజాయిషీ చెప్పుకోవలసిన అవసరమేముందని?

ఇలా వుంది-యిక్కడి మా క్షేమం! ఈ అర్థం కాని, అయోమయంగా వున్న స్థితిగతుల్లో నేనేదీ స్పష్టంగా వ్రాయలేకుండా వున్నాను. మనం మురిసే నాగరికత యిదేనా? ఈ భీభత్సదృశ్యమేనా? ఈ అలజడి జీవితమేనా? ఈ అశాంతి వాతావరణమేనా?

నేను - యింతటి అగ్నిగుండం మధ్యనుండి యెటూ తోచని, తేల్చుకోలేని ఒక సన్నని కేక వేస్తున్నాను. బహుశా బస్తీలో రక్షితస్థానంలో శాంతంగా, సుఖంగా జీవిస్తున్న నీకు వినబడుతుందా అని? వినిపించినా ఆలకిస్తావో, లేదో? ఆలకించినా సహకరిస్తావో, లేదో?

ఏదైనా- ఈసడిస్తే మాత్రం నా హృదయం బ్రద్దలయి పోతుంది. కన్నీరు కాల్వలై ప్రవహిస్తుంది.

ఏమిటో! క్షేమ సమాచారం తెలుపడానికి నిన్నింత దూరం శ్రమ పెట్టాను. ఇక్కడికే బరువెక్కువైంది. అవకాశ ముంటే- నీ జవాబువచ్చాక మరోసారి యితర విశేషాలు వ్రాస్తాను.